RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters
తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను
తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ ఆదివారం 9-8- 2026 సంపుటి : 6 సంచిక : 181 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00



## డీఎస్పీ అక్రమాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలి

- 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు
- ఎస్ఐఆర్‌లో ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలి
- వైఎస్సార్‌సీపీ కీలక నేతలతో సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్

2లో



## చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

- ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి
- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణ తరగతుల్లో చంద్రబాబు

2లో

# జెండా పండగ రోజు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దూకుడు




- పంద్రాగస్టు నుంచి మరింత మందికి పథకాలు
- మరో 2.25 లక్షల మందికి పింఛన్లు
- కొత్తగా 4 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్
- ఐదు లక్షల మందికి సిలిండర్ సబ్సిడీలు
- అదేరోజు సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం
- గిగ్ వర్కర్ల చట్టం అమలుకు శ్రీకారం
- గాంధీ సరోవర్, ఫ్యూచర్ సిటీ పైనా దృష్టి
- ఇందిరమ్మ టవర్లకు వచ్చే నెల్లో శంకుస్థాపన

హైదరాబాద్, **అభ్యుదయం**
పంద్రాగస్టున రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను విస్తరించనుంది. జెండా పండగను సంక్షేమ పండగగా మార్చేలా చర్యలు తీసుకోనుంది. రెండున్నర లక్షల మందికి కొత్తగా పెన్షన్లు ఇవ్వనుంది. 3-4 లక్షల మందికి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందించనుంది. ఇంతేకాకుండా మహాలక్ష్మి పథకం కింద కొత్తగా ఐదు లక్షల మందికి గ్యాస్ సిలిండర్ మీద రూ.500 చొప్పున సబ్సిడీ అందించనుంది. ఇంతేకాకుండా రాష్ట్రంలోని కోటీ ఐదు లక్షల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు ఆగస్టు 15 నుంచే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 17 నుంచి 30 వరకు విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. ఆయన తిరిగొచ్చాక సెప్టెంబరు మొదటి వారంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ పనులకు

**జెండా పండగ రోజు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దూకుడు పెంచనుంది. పలు పథకాల కింద కొత్తగా లబ్ధిదారులకు అవకాశం కల్పించనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రెండున్నరేళ్ల తరువాత తొలిసారి పెద్ద ఎత్తున కొత్త లబ్ధిదారులను పలు పథకాల పరిధిలోకి తేనుంది.**

శంకుస్థాపన చేస్తారు. దీంతోపాటు గిగ్ వర్కర్ల చట్టాన్ని ఆగస్టు 15 నుంచే అమల్లోకి తీసుకురావాలని ంరాష్ట్ర ప్రభుత్వం పట్టుదలగా ఉంది.
మూసీ పునరుజ్జీవం, గాంధీ సరోవర్ నిర్మాణం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి సంబంధించి కూడా కీలక ప్రకటనలు ఉంటాయని భావిస్తున్నారు. సనత్‌నగర్‌లో నిర్మించిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (టిమ్స్)ను కూడా ఆగస్టు 15నే ప్రారంభిస్తారు.

మిగతా 2లో

## యువతరం ప్రతి సమస్య గురించి ప్రశ్నించటంతో ఆగకుండా.. ఆ సమస్యలకు పరిష్కారాలను కూడా వెదకాలని

- జెన్‌జీ తరం దేశంపట్ల బాధ్యతనూ నెరవేర్చాలి
- నిత్యం నేర్చుకుంటేనే గెలుస్తారు
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో మోదీ



న్యూఢిల్లీ, **అభ్యుదయం** యువతరం ప్రతి సమస్య గురించి ప్రశ్నించటంతో ఆగకుండా.. ఆ సమస్యలకు పరిష్కారాలను కూడా వెదకాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. "ప్రతి తరానికీ దేశంపట్ల నిర్వహించాల్సిన బాధ్యతలుంటాయి. ప్రస్తుత యువత కూడా ఆ బాధ్యతలను నెరవేర్చాలి. దేశ సమగ్ర అభివృద్ధి సాధనను మీ లక్ష్యాల్లో భాగం చేసుకోండి. జెన్‌జీ తరం సామర్థ్యంపై నాకు పూర్తి నమ్మకం ఉంది. వికసిత భారత్ సాధనలో దేశానికి వారి అవసరం ఎంతో ఉంది" అన్నారు. ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని శనివారం మాట్లాడారు.

మిగతా 2లో



## 2028 నాటికి ఎయిర్ ట్యాక్సీలు

- కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు
- విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

2లో

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి అండగా కేసీఆర్

- బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆర్థిక అభయం
- పిల్లలకు 2 కోట్లు, ఆయన తల్లికి 25 లక్షలు
- పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ
- నేడు నర్సంపేటకు వెళ్లనున్న కేసీఆర్



వరంగల్, **అభ్యుదయం**
ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి అండగా నిలువాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ తరపున పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నట్టు ప్రకటించారు. ఇందులో సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు రూ. కోటి చొప్పున అందజేయనున్నారు. ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ.25 లక్షలను ఆమె పేరిట బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా ఆయన పిల్లల భవిష్యత్తు, వారి చదువు, తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతోపాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో

- మిగతా 2లో పేజీలో

## ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూల నిర్ణయం తీసుకోవాలి



- పీఆర్‌సీ, ఐఆర్, డీఏలపై ఉద్యోగుల ఎదురుచూపులకు తెరదించాలి
- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలి
- ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్

మిగతా 2లో

## చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

అమరావతి, భీమోదయం: ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారని చంద్రబాబు వివరించారు.

ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు.

## యువతరం ప్రతి సమస్య గురించి ప్రశ్నించటంతో ఆగకుండా.. ఆ సమస్యలకు పరిష్కారాలను కూడా వెదకాలని

'విద్యా సంస్థ నుంచి డిగ్రీ పట్టా తీసుకొని బయటి ప్రపంచంలోకి వెళ్తున్న యువత ఇక నేర్చుకోవటం అయిపోయిందని అనుకోవద్దు. మరో 20-30 ఏళ్ల తర్వాత ప్రపంచం ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. అందువల్ల నిత్యం కొత్త విషయాలను నేర్చుకుంటూనే ఉండాలి. అప్పుడే విజేతలుగా నిలవగలరు' అని అన్నారు. కాక్రోచ్‌ల ఉద్యమం తర్వాత జెన్‌జీని ఉద్దేశించి బహిరంగ వేదిక నుంచి మోదీ మాట్లాడటం ఇదే తొలిసారి. విద్యార్థులనుద్దేశించి ప్రధాని సరదా వ్యాఖ్యలు చేశారు. "ఈ హాలులోని ప్రతి ఒక్కరిలో ఉత్సుకత కనిపిస్తోంది. కానీ, గ్రాడ్యుయేట్ల బుర్రల్లో వేరే ఏదో ఉంది. నేను బాబా భాగేశ్వర్‌ను కాను. కానీ, వారి బుర్రల్లో ఉన్నదాన్ని చెప్పగలను. తొలి జాబ్ ఆఫర్.. అందుకోబోయే వేతనానికి సంబంధించిన ప్రశ్నలు వారి మెదళ్లను తొలుస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. అనంతరం అవార్డులకు ఎంపికయినవారికి బహుమతులు ప్రదానం చేశారు. విజేతల్లో విద్యార్థిని ఒకరిద్దరే ఉండటాన్ని ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. స్టెమ్ కోర్సుల్లో అమ్మాయిల భాగస్వామ్యం పెరగాలన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి అండగా కేసీఆర్

చర్చించి నిర్ణయం తీసుకున్నారుపెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమం ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యులు కూర్చొని ఆయన కుటుంబానికి అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, వారికి ఎల్లకాలం పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ అభయం ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం నర్సంపేటకు వెళ్లనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ తన ముఖ్య అనుచరుడిగా కొనసాగిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న అధినేత కేసీఆర్.. తన ఆప్తమిత్రుడు,

ఉద్యమ సహచరుడి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. నల్లబెల్లి మండల కేంద్రంలోని పెద్ది స్వగృహానికి చేరుకొని, కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వన్నారు. అలాగే నర్సంపేట నియోజక వర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ది అభిమానులకు కేసీఆర్ గుండె ధైర్యం ఇవ్వనున్నారు.

### రెండువారాలు బీఆర్ఎస్ 'పెద్ది' నామస్మరణ

గత నెల 26వ తేదీన పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై దవాఖానలో చేరిప్పటి నుంచి ఇప్పటిదాకా బీఆర్ఎస్ పార్టీ రెండు వారాలపాటు ఆయన నామస్మరణ చేస్తున్నది. రాజకీయ పార్టీల చరిత్రలో ఇది అరుదైన విషయమని అన్ని పార్టీల్లోనూ చర్చసాగుతున్నది. పార్టీని నమ్ముకొని ఉంటూ, నిజాయితీగా, చిత్తశుద్ధితో పనిచేసిన కార్యకర్త తీవ్ర అస్వస్థతకు గురై, అకాలమరణం పాలైతే పార్టీ యావత్తు ఆ కుటుంబానికి అండగా నిలువడం అసాధారణ విషయమని స్పష్టం చేస్తున్నారు. పార్టీ 26 ఏండ్ల ప్రయాణంలో బీఆర్ఎస్‌కు, ప్రత్యేకించి పార్టీ అధినేత కేసీఆర్‌కు దగ్గరైన అత్యంత సన్నిహితుల్లో పెద్ది ముందు వరుసలో ఉంటారు.

అలాగే, అధినేత కేసీఆర్ నమ్మకాన్ని ఏనాడూ వమ్ముచేయని కార్యకర్తగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మెలిగారు. ఉద్యమ సమయంలో సుదర్శన్‌రెడ్డి పోషించిన పాత్రకు, ఎమ్మెల్యేగా ఒక్కసారే పనిచేసినా నర్సంపేట నియోజకవర్గం శాశ్వత పురోభివృద్ధికి ఆయన వేసిన రోడ్‌మ్యాప్ ప్రజల గుండెల్లో ఏ స్థాయిలో నిలిచిందో ఆయన అంతిమయాత్రే లోకానికి తెలియజేసింది.

పెద్ది వ్యక్తిగా మరణించారు గానీ ఇటు పార్టీలో, అటు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేశారనేది చాటి చెప్పింది. రాజకీయ పార్టీలు తమ అవసరాల కోసం క్యాడర్‌ను ఇష్టారీతిగా వాడుకుంటూ, తమ ప్రయోజనాలే ధ్యేయంగా సాగుతున్న తరుణంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి వ్యవహారంలో బీఆర్ఎస్ చూపిన చొరవ, ఆయన కుటుంబానికి అండగా నిలిచిన వైనం అసామాన్యం అని అన్ని పార్టీల నాయకులు ప్రశంసిస్తున్నారు.

# ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూల నిర్ణయం తీసుకోవాలి

నెల్లూరు,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని సత్వరమే పరిష్కరించాలని, తక్షణమే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత రెవెన్యూ మొత్తం ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లకే ఖర్చవుతోందని చెప్పడం భావ్యం కాదని.. అన్ని రాష్ట్రాల ఉద్యోగులతో పాటే జీతాలు తీసుకుంటున్నామని.. ఎక్కువ చెల్లింపులేమీ జరగటం లేదని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. ప్రజలతో ఎన్నికైన ప్రభుత్వాలు వారి రాజకీయ అజెండాలో భాగంగా నియామకాలు జరుగుతున్నాయని, నిర్ణయాలు తీసుకుంటున్నాయని, లక్షలాది మంది నియామకాలు చేస్తున్నాయని, అందులో సగటు ఉద్యోగి బాధ్యత ఏముందని ప్రశ్నించారు. ఒకవేళ జీతాల పద్దు మితిమీరి పోయిందని భావిస్తే, ప్రభుత్వాలు అటువంటి నిర్ణయాలు తీసుకునే ముందు ఆలోచించుకోవాలన్నారు. ప్రజల ఎన్నుకొన్న ప్రభుత్వాలు తీసుకుని నిర్ణయాలకు సగటు ఉద్యోగి బలికాకుండా చూడవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు.నెల్లూరు పర్యటనలో భాగంగా శనివారం నగరంలోని ఎన్‌జీవో హోమ్‌లో ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణలు ఇతర నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ సొంత రెవెన్యూ ఆదాయంతో పోలుస్తూ చూడటం సరికాదన్నారు. ప్రభుత్వం పెడుతున్న ఖర్చులో 35 శాతానికి మించి ఉద్యోగుల జీతాలు పద్దు లేదని తెలిపారు. ఒకవేళ



2026-27 లెక్కల ప్రకారం కూడా సొంత రెవెన్యూ ఆదాయం చూసినా 1,40,000 కోట్ల రూపాయల్లో జీతాల పద్దును గమనిస్తే 60 శాతానికి మించలేదన్నారు. మేనిఫెస్టోలో వేతన సవరణ, మధ్యంతర భృతి వంటి హామీలు ఇచ్చారని, ఆరోజు కూడా జీతాలు పద్దు ఇంతే ఉందని గుర్తు చేశారు. అనుభవం కలిగిన ముఖ్యమంత్రిగా ఉద్యోగుల వేతన సవరణ విషయంలో పూర్తి అవగాహన కలిగిన ముఖ్యమంత్రిపై ఉద్యోగులు నమ్మకం పెట్టుకున్నారని తెలిపారు. ఒకపక్క ప్రజల సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు వంటి విషయాలలో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మొత్తం బడ్జెట్ ఉద్యోగులకే ఖర్చవుతుందని చెప్పటం సరికాదన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా అన్ని రాష్ట్రాలలో, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన కంపెన్సేటరీ మెకానిజం అయిన పీఆర్‌సీ కమిటీ నియమించకుండా, ఆరు నెలలకు ఒకసారి డిఏ చెల్లించకుండా, సగటు ఉద్యోగి ధరల ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక సతమతం అవుతున్నాడన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలి

తాడేపల్లి,డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, వాటికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనలను మరింత ఉధృతం చేయాలని పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రజల గళాన్ని బలంగా వినిపించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీలు/పార్లమెంట్ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు/నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్లమెంటు పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కో-ఆర్డినేషన్), రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు (కో-ఆర్డినేషన్), అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులతో శనివారం సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఎస్సీ అంశంపై చేపట్టాల్సిన తదుపరి ఆందోళన కార్యక్రమాలతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

లోకేష్ రాజీనామా డిమాండ్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి:

డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలన్నది నిరుద్యోగ యువత, అభ్యర్థుల న్యాయమైన డిమాండ్ అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ బలపడుతోందన్నారు.

# జెండా పండగ రోజు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దూకుడు

(మొదటి పేజి (తరువాయి)

రెండో విడత సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్న చర్చ జోరుగా జరుగుతోంది.

రాష్ట్రంలో ప్రస్తుతం వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, హెచ్ఐవీ-ఏఆర్‌టీ, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్, బీడీ రేకేదార్లు కలిపి 41 లక్షల మందికి ప్రభుత్వం ప్రతినెలా పెన్షన్ అందిస్తోంది.ఇందుకోసం నెలకు రూ.922 కోట్లు చొప్పున ఏడాదికి రూ.11 వేల కోట్లు ఖర్చవుతోంది. వీరితో పాటు తాజాగా తలసీమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితులకు కూడా పింఛన్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త పింఛన్ల మంజూరు కోసం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు సహా మరో 9 రకాల కేటగిరీల్లోని వారికి ప్రాధాన్యత క్రమంలో పింఛన్లను మంజూరు చేయాలని నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం నుంచి సర్క్యులర్ జారీ కావాల్సి ఉంది. జారీ అయిన వెంటనే దరఖాస్తులను స్వీకరిస్తామని అధికారులు చెబుతున్నారు. 11 కేటగిరీలు కలుపుకుని కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేసే అవకాశం ఉందని సమాచారం. ఏడాదికి రూ.500 కోట్ల భారం అదనంగా పడుతుందని అంచనా. మహాలక్ష్మిలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద 42.90 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. కొత్తగా జారీ అయ్యే స్మార్ట్ రేషన్‌కార్డులతో మరో ఐదు లక్షల కుటుంబాలకు సిలిండర్ పథకం అందుబాటులోకి వస్తుంది. కొత్తగా అర్హులను ఖరారు చేసే క్రమంలో ఆర్థిక పరమైన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, సంబంధిత ఫైలు ఆర్థిక శాఖకు చేరిందని సమాచారం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సాయం 50 లక్షల కుటుంబాలకు అందుతోంది.

కొత్తగా రేషన్ కార్డులు అందుకుంటున్న వారిలో 3-4 లక్షల కుటుంబాలు ఉచిత విద్యుత్ లబ్ధిదారులుగా మారే అవకాశం ఉంది. గత రెండున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 16.32 లక్షల కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసింది. దాంతో 61.09 లక్షల మంది ఆహార భద్రత పథకం పరిధిలోకి వచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.05 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయి. దాంతో 3.42 కోట్ల మందికి ఆహార భద్రత లభిస్తుంది. ప్రభుత్వం సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ ల్యామినేటెడ్ స్మార్ కార్డులను అందించనుంది. ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా నుంచి సీఎం రేవంత్




ఈ కార్డుల పంపిణీని ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డులు లబ్ధిదారులకు అందజేస్తారు. గిగ్ వర్కర్ల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేయడానికి అవసరం అయిన మార్గదర్శకాలకు ఆగస్టు 15 లోగా ప్రకటించి, అమల్లోకి తెస్తారు. మరోవైపు కొన్ని అభివృద్ధి పథకాలను కూడా ఆగస్టు 15న ప్రారంభించనున్నారు. సనత్‌నగర్ టిమ్స్ అందులో ప్రధానమైనది. ఉస్మానియా ఆసుపత్రి, నిమ్స్ కొత్త భవనాల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మూసీ పునరుజ్జీవనానికి సంబంధించి రుణ సేకరణ వ్యవహారాలు పూర్తవ్వడంతో ప్రభుత్వం ఆ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో కీలకమైన గాంధీ సరోవర్ నిర్మాణం పైనా ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తోంది.

# 2028 నాటికి ఎయిర్ ట్యాక్సీలు

బెంగళూరు,ఆగస్టు8 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని, ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు వచ్చే ఏడాది వేగవంతం కానున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

బెంగళూరులో సర్లా ఏవియేషన్ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారం భోత్సవంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు .ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ విమానాలు బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి రద్దీగా ఉండే మహానగరాలకు కొత్త రవాణా మార్గాన్ని అందించగలవని అన్నారు.

బెంగళూరులోనే కాకుండా, ముంబై, ఢిల్లీలలో కూడా వీటికి చాలా అవసరం ఉందని ఆయన చెప్పారు.

2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ సాంకేతికత ద్వారా బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ సమస్య భారీగా తగ్గుతుందని మంత్రి తెలిపారు. గంటన్నర నుంచి రెండు గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం 20 నుంచి 30 నిమిషాలకు తగ్గుతుందని స్పష్టం చేశారు.

'సర్లా ఏవియేషన్' కంపెనీకి డిజైన్ ఆర్గనైజేషన్ అప్రూవల్ ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మంజూరు చేసిందని, నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వచ్చే ఏడాది పూర్తిస్థాయి టెస్టింగ్ ఫేజ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ ప్రత్యేకతలు ముఖ్యంగా ఇది పైలట్‌తో పాటు ఆరుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు. ఇందులో మొత్తం 7 ఎలక్ట్రిక్ మోటార్లు ఉంటాయి (6 టేకాఫ్ కోసం, 1 ముందుకు వెళ్లేందుకు) ఇది ప్యూర్ ఎలక్ట్రిక్ ఆధారిత విమానం అయినప్పటికీ, అవసరమైతే గాల్లోనే బ్యాటరీ ఛార్జ్ చేసుకునేలా టర్బో-జెనరేటర్ అమర్చే వెసులుబాటు కూడా దీని డిజైన్‌లో ఉంది. స్వదేశీ తయారీ కావడంతో తక్కువ ధర: విమానయాన పరికరాలు (అవియోనిక్స్) మినహా మిగిలిన విడిభాగాలన్నీ భారత్‌లోనే తయారు కానున్నందున ప్రయాణ ధరలు సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. నిఖిల్ కామత్ (జెరోధా), బిన్నీ బన్సాల్ (ఫ్లిప్‌కార్ట్) వంటి దిగ్గజాల మద్దతు ఉన్న ఈ స్టార్టప్‌తో ఇప్పటికే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ శంషాబాద్/లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం, మణిపాల్ హాస్పిటల్స్ ఎయిర్ అంబులెన్స్ సేవల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే నగర ప్రయాణాలే కాకుండా ఎయిర్ అంబులెన్స్, అత్యవసర వైద్య రవాణా, కార్గో సేవల రంగంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించడమే కాక విదేశాలకు కూడా విమానాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# సిఎన్‌జికి ప్రత్యామ్నాయంగా బయోగ్యాస్

**దేశీయంగా ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంలో కేంద్రం**

**ఇంధన అవసరాలు తీర్చుకునేలా ప్రణాళికలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్8 దేశంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో సీఎన్‌జీలో కూడా బయోగ్యాస్‌ను మిళితం చేసి వినియో గదారులకు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర మంత్రివర్గం రూ.23,731 కోట్ల వ్యయంతో గోబర్ధన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, దిగుమతి చేసుకునే సహజ వాయువుపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. గోబర్ధన్ అంటే సేంద్రియ గ్యాస్. ఈ పథకాన్ని 2027 నుంచి 2036 ఆర్థిక సంవత్సరాల మధ్య అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తిని భారీగా పెంచడం, ఆ గ్యాస్‌ను సీఎన్‌జీ నెట్‌వర్క్‌లో వినియోగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కంప్రెస్డ్ బయోగ్యాస్ ను పశువుల పేడ, పంట అవశేషాలు, పురపాలక వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, చెరకు కర్మాగారాల వ్యర్థాలు వంటి సేంద్రీయ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. శుద్ధి పక్రియ అనంతరం ఈ గ్యాస్ రసాయనికంగా సహజ వాయువుకు చాలా దగ్గరగా ఉంటుంది. అందువల్ల ఇప్పటికే ఉన్న సీఎన్‌జీ, పీఎన్‌జీ పంపిణీ వ్యవస్థల ద్వారానే దీన్ని సరఫరా చేయవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉపయోగిస్తున్న సిఎన్‌జి కార్ల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బయో-గ్యాస్ రసాయనిక లక్షణాలు సహజ వాయువుకు సమానంగా ఉండటంతో వాహనాల్లో ఎలాంటి ఇంజిన్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్ అవసరం ఉండదు. పెట్రోల్‌లో ఇ20 వినియోగానికి ప్రత్యేక ఇంజిన్ అవసరమైనట్లు గా, బయో-అెఔఉ విషయంలో అలాంటి నిబంధనలు ఉండవు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం



నగర గ్యాస్ పంపిణీ సంస్థలకు బయోగ్యాస్ మిశ్రమం తప్పనిసరి కానుం ది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం బయోగ్యాస్ మిశ్రమంతో ప్రారం భించి, 2027-28లో 4 శాతానికి, 2028-29 నుంచి 5 శాతానికి పెంచా లని లక్ష్యంగా పెట్టు కుంది. పథకం అమలుతో దేశీయంగా బయో-గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే దశాబ్దంలో బయోగ్యాస్ ఉత్పత్తి దాదాపు 10 రెట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో విదేశాల నుంచి సహజ వాయువు దిగుమతులపై ఆధారపడటం తగ్గి, దేశ విదేశీ మారక వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ÷ళింద్రీయ వ్యర్థాలను వినియోగించి ఇంధనం ఉత్పత్తి చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ మెరుగుపడటమే కాకుండా, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు పంట అవశేషాలు, పశువుల పేడ వంటి వనరుల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశాలు కూడా ఈ పథకం ద్వారా ఏర్పడనున్నాయి. దేశంలో స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచే దిశగా గోబర్ధన్ పథకం కీలక అడుగుగా భావిస్తున్నారు.

## ఔటర్ వద్ద పిల్లర్‌ను ఢీకొన్న కారు

**ఇద్దరు టైల్స్ కార్మికుల దుర్మరణం**

హైదరాబాద్,ఆగస్ట్8నగరంలో ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి గచ్చిబౌలి సమీపంలోని నియోపోలీస్ బ్రిడ్జ్ పిల్లర్‌ను టవేరా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు రాజస్థాన్‌కు చెందిన కనైయాలాల్ (25), దేరామ్ (24)గా గుర్తించామని తెలిపారు. వీరిద్దరు టైల్స్ కార్మికులుగా పని చేస్తున్నారని చెప్పారు. ఇంద్రారెడ్డి నగర్ నుంచి నానక్‌రామ్‌గూడ వెళు ్తండగా ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

## హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

- వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
- సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట




హైదరాబాద్,ఆగస్ట్8 నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పక్రియ తీవ్ర గందగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టుల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు

## ఫీజు కోసం వేధింపులు..విద్యార్థి ఆత్మహత్య

కాకినాడ,ఆగస్ట్8 స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల సిబ్బంది వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ జగన్నాథపురంలోని జె.రామారావుపేట సమ్మెటవారి వీధికి చెందిన పైలా రాంబాబు, జ్యోతి దంపతుల రెండో కుమారుడు పైలా అరవింద్ (15) స్థానికంగా ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు.శుక్రవారం అరవింద్, అతడి తండ్రి మొదటి టర్మ్ ఫీజు కట్టేందుకు కళాశాలకు వెళ్లినప్పుడు.. చాలామంది సెకండ్ టర్మ్ కూడా కట్టేశారని, మీరు ఇంకా మొదటి టర్మ్ ఫీజే కట్టలేదని సిబ్బంది అనడంతో వారు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అరవింద్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## వివేకా హత్యకేసు విచారణలో అవకతవకలు

**- మరోమారు వైఎస్ సునీత ఆరోపణలు**

కడప,ఆగస్ట్8 మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కుమార్తె వైఎస్ సునీతా రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వివేకా హత్య కేసు విచారణలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. శనివారం వైఎస్ వివేకా 75వ జయంతి సందర్భంగా పులివెందుల్లోని వివేకా సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం సునీత మీడియాతో మాట్లాడుతూ.. 'నా తండ్రి వివేక హత్య కేసు విషయంలో గత ఆరునెలల కాలంగా జడ్జిమెంట్లు కూడా సరిగా లేవని నా అభిప్రాయం. విచారణలో అవకతవకలు ఉండడం వల్లే ఇన్నిసార్లు కోర్టుమెట్లు ఎక్కాల్సి వచ్చింది' అని చెప్పుకొచ్చారు. ఏదో ఒకరోజు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో పోరాటం కొనసాగిస్తూనే ఉంటానని సునీత అన్నారు. వివేక హత్య జరిగిందని అందరికంటే ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే తెలుసు అని సునీత పేర్కొన్నారు.

## మహిళా బిల్లుపై మాటల యుద్ధం

**కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్**

న్యూఢిల్లీ,ఆగస్ట్8: మహిళా రిజర్వేషన్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. 'ఎక్స్' సోషల్ మీడియా వేదికగా పరస్పరం స్పందించారు. మహిళా శక్తిపై రాహుల్ వ్యాఖ్యలను స్వాగతించిన రిజిజు.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతివ్వాలని కోరారు. దీనికి ఘాటుగా బదులిచ్చిన రాహుల్.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. వీడియోపై రిజిజు స్పందిస్తూ.. 'కాంగ్రెస్ పార్టీలో ఇది సానుకూల సందేశంగా కనిపిస్తోంది. రాహుల్ వైఖరిలో మహిళల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతివ్వాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. 'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం బాగా ఎవరికి తెలుస్తుంది? మహిళా రిజర్వేషన్ చట్టం-2023 కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైంది. అయినా మూడేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడు దాన్ని డీలిమిటేషన్‌తో అనవసరంగా ఎందుకు ముడిపెడుతున్నారు?' అని ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ విడుదల చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహిళల శక్తి ఇంకా పూర్తిస్థాయిలో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాకుండా.. ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ చేసిన వరుస వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రంతో కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

**15 ఆగస్టున ప్రారంభించనున్న సిఎం**

నిజామాబాద్,ఆగస్ట్8 రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్ట్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేశారు.

## బాబాయి మృతిని తట్టుకోలేక అబ్బాయి ఆత్మహత్య

ఒంగోలు,ఆగస్ట్8 ప్రకాశం జిల్లా కంభంలో తీవ్ర విషాదం ఘటనచోటుచేసుకుంది. బాబాయి మృతి చెందడాన్ని తట్టుకోలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాబాయి మణికుమార్ మృతి చెందిన విషయం తెలుసుకున్న క్లైమ్ బాబు అనే యువకుడు.. తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాధలోనే కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. ఒకే కుటుంబంలో వరుసగా ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మణికుమార్ కొంతకాలంగా అనారో గ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయనను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మణికుమార్ మృతి చెందారు. బాబాయి మృతి వార్త క్లైమ్ బాబును తీవ్రంగా కలిచివేసినట్లు తెలుస్తోంది. బాబాయితో ఉన్న అనుబంధం కారణంగా ఆయన మృతిని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన బాబు.. కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణికుమార్, ÷-లకైమ్ బాబు మృతదేహాలకు కుటుంబ సభ్యులు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబంలో ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి జరగడం చూసి స్థానికులు సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన కంభం ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## లోయలో పడ్డ బొలెరో వాహనం

**ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం**

నైనిటాల్,ఆగస్ట్ ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్రగాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

## మంగాపురం వద్ద వాచ్‌మెన్ దారుణ హత్య

చిత్తూరు,ఆగస్ట్8 చిత్తూరు రూరల్ మండలం మంగాపురం వద్ద దారుణ హత్య కలకలం రేపింది. ఎన్ఆర్ఐ పట్టాభి నాయుడు ఇంటి వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆనందరావు (50)ను గుర్తుతెలియని దుండగులు కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఇంటి అద్దాలను నాటుబాంబుతో పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు.. వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిత్తూరు డీఎస్పీ వెంకటనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అసలు దుండగులు ఇంట్లోకి ఎందుకు చొరబడ్డారన్నది దర్యాప్తు చేస్తున్నారు. ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ఆగస్టు 10న వరంగల్ జిల్లాలో జైల్ భరో ను జయప్రదం చేయండి!

**సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు**

వరంగల్‌స్టు 8కిలా వరంగల్ మండలం రంగశాయి పేట జంక్షన్ యందు సిఐటియు జిల్లా అధ్యక్షులు వీణ బషీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన జైల్ భరో ఆటో ప్రచార జాతను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర వంగూరు రాములు హాజరై జెండా ఊపి ప్రచార జాతను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో
ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల, కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తున్నదని ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని విదేశీ బహుళ జాతి సంస్థలకు తాకట్టు పెడుతుంది అనీ నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో
కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు ప్రజాతంత్ర వాదులు పోరాడాలని క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో భారతదేశాన్ని కాపాడుకోవాలని అందుకోసం దేశవ్యాప్తంగా ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా జైల్ భరో నిర్వహించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు . కేంద్రంలో నీబిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్ ల అమలుకు ఫైనల్ రూల్స్ ను నోట్ పై చేసి 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందనీ రోజువారి పని దినాన్ని 8 గంటల నుండి 12 గంటలకు పెంచుకు నేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛని ఇచ్చారనీ సమ్మెకులను కాలరాస్తూ ఆంక్షలు విధించారనీ కార్మిక సంఘాల గుర్తింపు రిజిస్ట్రేషన్ లో కష్టతరం చేశారనీ అన్నారు, కార్మికులకు కనీస వేతన చట్టం లేకుండా చేశారు అదేవిధంగా రైతులకు విత్తన సవరణ చట్టం విద్యుత్ సాధన చట్టం స్మార్ట్ మీటర్లు ప్రజలను మరింత దోచుకుని ప్రైవేట్ కంపెనీలకు వ్యవసాయ కూలీలకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుచేసి జి బి జి రామ్ జి పథకాన్ని తీసుకొచ్చారని నుండి కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి వైద్యులతో ఉండాలని ఈ రకంగా దేశంలో కార్మికులు రైతులు అందరికీ నష్టం కలిగించే ఈ విధానాలైనా ఇప్పటికీ అనేకసార్లు సమ్మెలు పోరాటాలు నిర్వహించిన ఈ ప్రభుత్వానికి పార్లమెంట్లో మెజారిటీ ఉన్నదని అహంతో ఇంతటి అన్యాయానికి వడగట్టిందని ఈ అన్యాయాలను తీవ్రంగా ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని దానికి గాను భారత దేశ వ్యాప్తంగా కీర్తిని ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు రైతు సంఘాలు వ్యవసాయ కూలీ సంఘాలు ఐక్య పిలుపులో భాగంగా జైల్ భరో కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నామని వరంగల్లో పోచమ్మ ప్రాంతంలో జరిగే ఈ జైల్ బరో నిరసన ధర్నా లో ప్రజలంతా




పాల్గొనాలని పిలుపునిచ్చారు.
సిఐటియు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ మాట్లాడుతూ సిఐటియు మరియు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా దేశవ్యాప్త జైలు బరువు కార్యక్రమం వరంగల్ జిల్లా కేంద్రం పోచం మైదాన్ లో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ ధర్నా కార్యక్రమం లో జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల కార్మికులు రైతులు కూలీలు వ్యాపారులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు స్కీం వర్కర్స్ మహిళా ఉద్యోగులు యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు తాటికాయల రత్నం, మొగుళ్ళ అనిల్ ,మన్నూరి జ్యోతి, సింగారపు కృష్ణ , కోమల, కార్మికులు తదితర పాల్గొన్నారు

# రోడ్డుపై 'చేపల వేట'..!

- భూపాలపల్లిలో బీఆర్ఎస్ యూత్ వినూత్న నిరసన
- సుభాష్ కాలనీ రోడ్డు పనుల జాప్యంపై ఆగ్రహం
- వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్

భూపాలపల్లి, ఆగస్టు 8 (నారద):
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ యూత్ విభాగం ఆధ్వర్యంలో శనివారం వినూత్న నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ అర్బన్ యూత్ ప్రధాన కార్యదర్శి మహేందర్ యాదవ్ నేతృత్వంలో నాయకులు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో చేపల వలలు, గాలాలు వేసి 'చేపల వేట' చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.

సుభాష్ కాలనీ ప్రధాన రహదారి నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో వర్షపు నీరు పెద్దఎత్తున గుంతల్లో చేరి చెరువులను తలపిస్తోందని నాయకులు విమర్శించారు. దీంతో వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రోడ్డు పరిస్థితిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆరోపించారు.

ఈ సందర్భంగా యూత్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు మాట్లాడుతూ.. రోడ్డు పనులు ప్రారంభించి చాలాకాలం గడుస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వర్షం పడితే రోడ్డంతా



జలమయమవడంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక 16వ వార్డు కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, వార్డు అధ్యక్షుడు మోహన్ చారి, కంచు రాజేందర్, గట్టయ్య, రాయమల్లు, పృథ్వీ, తిరుపతి, నరసింహాచారి, బ్రహ్మారెడ్డి, శోభన్‌బాబు, యూత్ నాయకులు జోర్ రాజ్‌కుమార్, అంగోతు తిరుపతి, గసిగంటి కుమార్, బానోతు మహేష్, ఆదిత్య, బన్నీ, మేకల రాజు, ఆకాష్, బీఆర్ఎస్వీ నాయకుడు కొలీజు దిలీప్‌కుమార్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# సాహిత్యంలో లెజెండ్ గద్దరన్న

**- గద్దర్ వర్ధంతి సభలో జన నాట్యమండలి నాయకుడు సంజీవ్**

**- హనుమకొండలో ఘనంగా గద్దర్ వర్ధతి సభ**

హన్మకొండ నారద ఆగస్టు 08
జనం సమస్యలకు జనం బాషను, జనం యాసను, భౌతికవాదాన్ని జోడించి సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించిన గొప్ప కవి, కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ సాహిత్యంలో లెజెండ్ అని జననాట్యమండలి నాయకుడు సంజీవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో గద్దర్ గళం ఆధ్వర్యంలో విసికె పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ 3 వ వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన ఆయన మాట్లాడారు. తరతరాలుగా దేశంలో జరుగుతున్న దోపిడి, దేశ భూస్వామ్య, పాలకుల దోపిడీకి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ తోడై దోపిడి ఎలా కొనసాగిందో, ఆ దోపిడిలో చిక్కుకున్న ప్రజలు ఎలా విలవిలలాడారో గద్దర్ ప్రతి పాటలో కనపడుతుందని అన్నారు. ప్రజల అజ్ఞానం, మూఢనమ్మకాలు, పాలకుల దోపిడి, పోలీసుల ప్రవర్తనపై ప్రజల బాషలో, పలు భాషల్లో పాడి ప్రజలను చైతన్యం చేసి ప్రజా యుద్ధానికి సిద్ధం చేసిన యుద్ధ నౌక గద్దర్ ప్రపంచంలోనే గొప్పవాడని అన్నారు. గద్దర్ అజ్ఞాతంలో ఉన్నపుడు అన్న కోసం మూడు సంవత్సరాలు ఆటో నడిపి గద్దరన్నను సాధుకున్నట్లు ఆవేదనతో మాట్లాడాడు. సాంస్కృతిక ఉద్యమంలో నిర్మాణాత్మకమైన సమస్యల గురించి గద్దర్ వ్రాశాడని, సామ్రాజ్యవాదం గురించి, అమెరికా దోపిడి గురించి రచించి పాడిన గద్దర్ కార్మికుల గురించి, కర్షకుల గురించి, మహిళల గురించి, కూలీల గురించి, తల్లుల త్యాగం గురించి, విద్యార్థుల త్యాగాల గురించి ఏ వర్గాన్ని కూడా విస్మరించకుండా చైతన్యపరిచి తన జీవితాంతం పోరాటం చేశాడని అన్నారు. ఆయా వర్గాల సమస్యలపై, ప్రజల విముక్తికై గద్దరన్న పాడిన పాటలను సంజీవన్న పాడి సభను ఉత్తేజపరిచారు. గద్దరన్న ఆశయ సాధన కోసం ఆయన లాగ అంకితబావంతో కృషి చేయడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్యూడలిజంతో ప్రజాస్వామిక చర్చలు సాధ్యం కావని, అందుకే పీడిత వర్గాలు విప్లవించాయని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన గద్దర్ గళం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ పాలకులు గద్దర్ పేరును మాత్రమే వాడుకుంటున్నాయని, ఆయన ఆశయాలకు విరుద్ధంగా పని చేస్తున్నారని విమర్శించారు. గౌరవ అతిథి యశపాల్ మాట్లాడుతూ జనపదాలను విప్లవీకరించాలనే లక్ష్యంతో గద్దర్ అద్భుతమైన పాటలు రాశాడని వివరించారు. గద్దర్ పేరుతో ఒక సాహిత్య సాంస్కృతిక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. గద్దర్ విగ్రహాన్ని హన్మకొండలో ఏర్పాటు చేయాలని ప్రొ. తిరునహరి శేషు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎగ్గడి సుందర్ రామ్ స్వాగతం పలుకగా సిపిఎం నాయకులు చుక్కయ్య, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు రమక్క,




అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లన్న, అసంఘటిత కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు నలిగింటి చంద్రమౌళి, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, డాక్టర్ మంద వీరస్వామి, తెలంగాణ శ్యాం, సీనియర్ న్యాయవాదులు పులి సత్యనారాయణ, రామస్వామి, షేక్ అబ్దుల్ నబీ, విలాసాగరం సురేందర్ గౌడ్, బండి మొగిలి, సారంగపాణి, రాచకొండ ప్రవీణ్ కుమార్, వివిధ సంఘాల నాయకులు వలి ఉల్లా ఖాద్రీ, నున్న అప్పారావు, నరోత్తమ్ సూరీ, డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, కోంద్ర నరింగరావు, దూడల సాంబయ్య, సింగారపు అరుణ న్యాయవాదులు గురిమిల్ల రాజు, ప్రభంజన్, రాజేందర్, చెరిపెల్లి ఆనంద్, వివిధ సంఘాల నాయకులు సాధం రాజన్న, గుమ్మడిరాజుల సాంబయ్య, జనగాం కుమారస్వామి, కన్నం సునీల్, అంకేశ్వరపు రాంచందర్, శ్యాం, చారువాక, ఓంబ్రహ్మమ్, కళక్క, రాదక్క, మాదాసి సురేష్, కెదాసి మోహన్ సంఘి ఎలేందర్, కేడల ప్రసాద్, కన్నాల రవి, అంబాల అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు కళాకారులు బి.కె, మచ్చ దేవేందర్, గద్దర్ సాంబయ్య, యోచన, దార దేవేందర్, రామంచ భరత్, సుదమల్ల అశోక్, సురేష్ మహాజన్

## జావెలిన్ త్రోలో ఎం. అమృతకు ద్వితీయ స్థానం




కామారెడ్డి ఆగష్టు 8
మర్కల్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం. అమృత జావెలిన్ త్రోలో ప్రతిభ చాటింది. హనుమకొండలోని జె.ఎన్. స్టేడియంలో ఆగస్టు 7, 8 తేదీల్లో నిర్వహించిన 12వ తెలంగాణ యూత్ (అండర్-18) అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్లో మహిళల జావెలిన్ త్రో విభాగంలో 23.48 మీటర్ల దూరం విసిరి ద్వితీయ స్థానాన్ని సాధించింది.అమృత ప్రతిభను గుర్తించిన తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వాహకులు ఆమెకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి మాట్లాడుతూ అమృత సాధించిన విజయం కళాశాలకు, జిల్లాకు గర్వకారణమని అభినందించారు. క్రీడలతో పాటు విద్యలోనూ మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.
అమృతను కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి, అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.

## మర్కల్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఆషాఢ మాస బోనాల కార్యక్రమం



సదాశివనగర్, ఆగస్టు 8
కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆషాఢ మాస బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం బోనాలను అందంగా అలంకరించి, గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం గ్రామంలోని కట్ట మైసమ్మకు బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగెం శ్రీనివాస్, ఉపాధ్యాయులు కార్తీక్, సౌమ్య, అఖిల, రమ్య, విమల, స్కావెంజర్లు లావణ్య, సుజాతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో సంప్రదాయ పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

## పాఖాలలో ఎస్సీ కుల పెద్దమనిషిగా బాకి మధుసూదన్

- సారికోళ్ల మేతరిగా బాకి రవి.. ఊరు బైండ్లగా జిలుకర కృష్ణాకర్
- వంశపారంపర్య ఆచారాల ప్రకారం ఏకగ్రీవ ఎంపిక
- వివిధ కుటుంబాల పెద్దల సమక్షంలో అధికారిక ప్రకటన



పాఖాల, ఆగస్టు 8
పాఖాల గ్రామంలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన వివిధ కుటుంబాల పెద్దలు శనివారం సమావేశమై, తరతరాలుగా వస్తున్న వంశపారంపర్య ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ కుల పెద్దలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పురాతన కాలం నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం కీర్తిశేషులు బాకి యాకయ్య కుమారుడు బాకి మధుసూదన్‌ను కుల పెద్దమనిషిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా లిసారికోళ్ల మేతరిగా బాకి రవి ని ఎంపిక చేసినట్లు గ్రామ కుల పెద్దలు తెలిపారు.ఈ సమావేశంలో బాకి, జిలుకర, గంగదారి, ఉప్పుగళ్ల, మచ్చ, ఆకారపు, కొంగరి, ఎడెల్లి, బురుక, మాదారపు కుటుంబాలకు చెందిన పెద్దలు పాల్గొని, సంప్రదాయ పద్ధతిలో జరిగిన ఎంపికకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.అలాగే తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం కీర్తిశేషులు జిలుకర రామస్వామి కుమారుడు జిలుకర కృష్ణాకర్‌ను 'ఊరు బైండ్ల'గా కుల పెద్దల సమక్షంలో అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారు కులంలోని కుటుంబాల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ, పెద్దల సూచనలు, సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న పెద్దలు ఆకాంక్షించారు.

## పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఒక భరోసా

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**రెండేళ్లలో రాయదుర్గం నియోజకవర్గంలో 531 మందికి రూ.3.31 కోట్ల సాయం.**





ఆగస్టు 8,రాయదుర్గం :
అత్యవసర పరిస్థితుల్లో ఖరీదైన వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని తన స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో రాయదుర్గం నియోజకవర్గానికి ఎన్నడూ లేనంతగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిందని తెలిపారు. శనివారం ఒక్కరోజే 51 మంది లబ్ధిదారులకు రూ.33 లక్షల విలువైన చెక్కులను అందజేశామని చెప్పారు. అనారోగ్యంతో భర్తను కోల్పోయిన భార్యతో పాటు నలుగురు పిల్లలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అలాగే తల్లి చికిత్స కోసం అప్పులు చేసి ఖరీదైన వైద్యం చేయించిన కుటుంబం.. చివరకు ఆమెను కోల్పోయిన విషాద పరిస్థితిలో ఉందని, అలాంటి కుటుంబానికి కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్పించగలిగామని చెప్పారు. ఇలాంటి ఎన్నో కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు. వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చుకోవడానికి, ఇప్పటికే పెట్టిన వైద్య ఖర్చుల్లో కొంత భారాన్ని తగ్గించుకోవడానికి ఈ ఆర్థిక సహాయం దోహదపడుతోందన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో గత రెండేళ్లలో ఇప్పటివరకు 531 మంది లబ్ధిదారులకు రూ.3.31 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి అందించామని తెలిపారు. వైద్యం కోసం చేసిన అప్పులు, ఆర్థిక ఇబ్బందుల గురించి లబ్ధిదారులు తనను కలిసి వివరించినప్పుడు చాలా బాధ కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. అలాంటి కుటుంబాలకు తప్పనిసరిగా సహాయం అందించాలనే సంకల్పంతో వారి సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వ్యక్తిగతంగా తీసుకెళ్లి వివరించడంతో, అర్హులైన వారికి తగిన స్థాయిలో సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ప్రతినిధిగా తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నందుకు వారి కష్టాల్లో అండగా నిలవడం బాధ్యతగా భావిస్తానన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వివిధ రూపాల్లో వారికి సహాయం చేయగలుగుతున్నందుకు ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు కురుబ హనుమంతు, వన్నారెడ్డి, కురుబ మల్లెన్న, డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ కన్వీనర్ కురుబ గిరిమల్లప్ప, కేపి దొడ్డి నాగరాజు,మాజీ సర్పంచ్ నాగరాజు,రైస్ మిల్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జ్యుడీషియల్ టీం ఆధ్వర్యంలో జరిగిన షటిల్ టోర్నమెంట్



హిందూపురం ఆగస్టు 8:
బార్ అసోసియేషన్ జ్యుడీషియల్ టీం ఆధ్వర్యంలో జరిగిన షటిల్ టోర్నమెంట్ లో హిందూపురం బార్ అసోసియేషన్ తరఫున న్యాయవాదులు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు ఈ యొక్క షటిల్ టోర్నమెంట్ను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ జడ్జి నిఖిల్ రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి టోన్మెంట్ ప్రారంభించడం జరిగింది . అలాగే ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ జడ్జి ఒక సెటిల్ మ్యాచ్ ఆడి గెలిచి అందర్నీ ఉత్సాహపరచడం జరిగింది ఈ కార్యక్రమంలో సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు పాల్గొనడం జరిగింది . మహిళల తరఫున మమత సౌజన్య టీం ఫైనల్లో గెలవడం జరిగింది పురుషుల తరఫున శివశంకర్ సాయి నంది టీం ఫైనల్ లో గెలవడం జరిగింది మొత్తం పోటీలో దాదాపు 16 టీం లో పాల్గొన్నాయి జుడిషియల్ టీం రెండో రన్నర్ ప్ గా నిలిచింది ఈ కార్యక్రమంలో న్యాయం నిర్ణయతగా ఇందాద్ పాల్గొనడం జరిగింది అలాగే ఈ కార్యక్రమం జరగడానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ ఈ రాజశేఖర్ కళావతి సిద్దు శ్రీనివాస్ రెడ్డి ఏజీపీ రామచంద్రప్ప సహకరించారు అలాగే ఈ కార్యక్రమానికి ఏపీపీ గోపాలకృష్ణ భోజన సౌకర్యం కల్పించారు

# ధర్మవరంలో ఆటో డ్రైవర్లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్ల పంపిణీ....

**● ప్రయాణికుల భద్రతతో పాటు ఆటో డ్రైవర్లపై ప్రజల్లో నమ్మకం పెంచడమే లక్ష్యం: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్**

**● ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి సత్యకుమార్ యాదవ్**

**● ప్రయాణికుల భద్రతను మరింత పెంపొందించడంతో పాటు ఆటో డ్రైవర్లపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచే లక్ష్యంతో క్యూ ఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు.**






ధర్మవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ధర్మవరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆటో డ్రైవర్లకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ఆటో డ్రైవర్లకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లను అందజేశారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, కొంతమంది ప్రయాణికుల్లో ఆటోల్లో ప్రయాణించడంపై, ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ఆందోళన ఉందన్నారు. దీనివల్ల నిజాయితీగా సేవలందిస్తున్న ఆటో డ్రైవర్ల ఆదాయంపై కూడా ప్రభావం పడుతోందని తెలిపారు. అన్ని ఆటో డ్రైవర్లను అనుమానించాల్సిన అవసరం లేదని, అయితే ప్రయాణికుల్లో భద్రతపై మరింత విశ్వాసాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.
మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ,
ఆటో డ్రైవర్ల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ధర్మవరంలోని ఆటో డ్రైవర్లందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతను ప్రధాన లక్ష్యంగా చేసుకుని పోలీస్ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు.
ప్రతి ఆటో డ్రైవర్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. వాహన మిత్ర పథకం ద్వారా సుమారు మూడు లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్ల మేర ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో, డి.ఎస్.పి జగన్నాథ్ రావు, ఆర్డిఓ రాంభూపాల్ రెడ్డి, సిఐలు, రెడ్డప్ప ,జయ నాయక్ , లక్ష్మీ కాంత్ రెడ్డి, ఎస్సైలు ఆటో డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యాభర్తల గొడవలపై తగిన రాజి చేసి, వారిని కలపడమే పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ లక్ష్యం.. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్.




ధర్మవరం, ఆగస్టు 8.
భార్యాభర్తల చిన్నచిన్న గొడవలపై తగిన రాజీ చేసి, వారిని తిరిగి కలపడమే పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ లక్ష్యము అని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో గల పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ కార్యాలయంలో వారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సభ్యులు డిటైర్డ్ హెడ్మాస్టర్ చలపతి, లాయర్ బాలసుందరి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాభవాని, పాత్రికేయులు రాఘవ మాట్లాడుతూ జనవరి 2026 లో ఈ కౌన్సిలింగ్ ప్రారంభమై ఆగస్టు నెల ఏడవ తేదీ వరకు 50 మంది భార్యాభర్తల జంటలకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని, ఇందులో 39 మంది భార్యాభర్తలను తిరిగి కలిపి నూతన జీవితాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు. వారంలో శనివారం కాకుండా, ప్రతిరోజు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లాలోనే ధర్మవరం పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ముందంజలో ఉండడం నిజంగా అభినందించదగ్గ విషయమని, సేవాభావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విజయం సాధించడం పట్ల వారు ప్రత్యేకంగా సభ్యులను అభినందించారు. ఈ పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ కు ఇంకను ఏదైనా అవసరాలు, ప్రత్యేక వసతులు, సలహా సూచనలు తప్పక మా పోలీస్ శాఖ నుండి ఇవ్వడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు. అనంతరం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ కు వచ్చిన చెన్నై కొత్తపల్లి మండలానికి చెందిన భార్య, భర్తలతో కాసేపు వారు చర్చించారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని 10 పోలీస్ స్టేషన్లో నుండి ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు నడుపుతున్నామని తెలిపారు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా భార్యాభర్తల చిన్నచిన్న తగాదాల విషయంలో చక్కగా కౌన్సిలింగ్ ఇస్తూ వారి నూతన జీవితానికి మరోసారి అవకాశం ఇవ్వడం అనేది అభినందించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం సభ్యులకు ప్రత్యేకంగా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి.. బీవీ జగన్నాథరాజు, వన్ టౌన్ సిఐ రెడ్డప్ప, కౌన్సిలింగ్ సభ్యులు చలపతి, బాల సుందరి, గంగాభవాని, రాఘవ పాల్గొన్నారు.

## ప్రతిభను అవమానించడం తగదు : కాలవ






, ఆగస్టు 8,రాయదుర్గం : ప్రతిభ ఆధారంగా 2025-డీఎస్సీ లో నియమితులైన ఉపాధ్యాయులపై జరుగుతున్న అసత్య ఆరోపణలను, దాని వెనుక ఉన్న రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నిజాన్ని ప్రజలకు వివరించేందుకు పోరాడుతున్న డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రజాస్వామ్యవాదులు అండగా నిలవాలని కోరారు. కర్నూలులో డీఎస్సీ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సంఘీభావ ర్యాలీలో పాల్గొనేందుకు రాయదుర్గం నుంచి బయలుదేరిన ఉపాధ్యాయుల వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పోటీ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎంపికై ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారిని కావాలనే అవమానించేలా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఎంతో కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో ప్రతిభను నిరూపించుకుని ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై నిందారోపణలు చేయడం, వారి ప్రతిభను ప్రశ్నించడం సమంజసం కాదన్నారు. కేవలం 230 రోజుల్లోనే 180కి పైగా న్యాయపరమైన కేసులను ఎదుర్కొని, మెగా డీఎస్సీ--2025 ద్వారా 16,376 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన నియామక ప్రక్రియ ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారిని రాజకీయ ప్రయోజనాల కోసం లక్ష్యంగా చేసుకోవడం బాధాకరమన్నారు. దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 2025 డీఎస్సీ ఉపాధ్యాయులు కర్నూలులో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించే ఈ ఐక్యతా కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు తమపై జరుగుతున్న దుష్ప్రచారానికి గట్టి సమాధానం ఇవ్వబోతున్నారన్నారు. "నిజం గడప దాటేలోపే అసత్యం ఊరంతా తిరిగి వస్తుంది" అన్న సామెతను గుర్తుచేస్తూ.. అసత్య ప్రచారం ఎంత విస్తృతంగా జరిగినా చివరకు నిజమే గెలుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సత్యాన్ని, నిజాన్ని కోరుకునే వారందరూ వారికి భరోసాగా నిలవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, మేధావులు సంఘీభావం ప్రకటించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి అగ్రహారం కిరణ్, రిటైర్డ్ ఎం.ఈ.ఓ వెంకట రమేష్ ,ఉపాధ్యాలు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# బొద్దింకల వేటలో రాహుల్ !

బొద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఎ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు. ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ కూడా ఓ క్రమపద్ధతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు. ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని కూడా మార్చారు. జీన్స్, టి షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితందీనిని రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందుకు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండాఇ, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసు కుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందుకే ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నారు. జెన్‌జీ లంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్ధం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడం లేదు. డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోయారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచి స్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. కేవలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

# అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

### అరుణాచల్ మ్యాప్‌ను విడుదల చేసిన భారత్




న్యూఢిల్లీ,ఆగస్ట్8 భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు. ఈ ప్రాంతాలన్నీ మిలిటరీ మ్యాపుల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులో వీటిని స్పష్టంగా చూపించడమంటే చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. మ్యాపులో చూపించిన పలు ప్రాంతాల్లో చైనా, భారత్ దళాల మధ్య ఘర్షణలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్ అని పిలిచే చైనా ఆ రాష్ట్రంలోని 23 ప్రాంతాలకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ చర్యలతో క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు ఉండవని చైనాకు భారత్ అప్పట్లోనే గట్టి కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగంగానే ఉంటుందని స్పష్టం చేసింది. చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు రేఖ మెక్‌మెహన్ లైన్ టిబెట్, అరుణాచల్ ప్రదేశ్‌ను వేరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఖరారు చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది.

ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రిత్‌నగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చురీ, బుద్ధ మందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశాన్ని .. జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

### పూర్తిస్థాయి జలమట్టానికి చేరువలో నీటిమట్టం

శ్రీశైలం,ఆగస్ట్8 ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2,32,308 క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 876.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 169.46 టీఎంసీలకు చేరింది. ఈ క్రమంలో అధికారులు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుదుత్పత్తి చేసి 66,460 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,133 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 8 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా, కృష్ణా నదిలో వరద ప్రవాహం పరవళ్లు తొక్కుతున్నా సాగర్‌కు విడుదల కావడం లేదు. ఒకవైపు కృష్ణా, భీమా నదులు పొంగిపొర్లుతూ శ్రీశైలం వైపు పరుగులు తీస్తుంటే రాష్ట్ర సర్కార్ పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోయకుండా దోబూచులాడుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మరో నాలుగు మోటర్లతో కూడా నీటిని ఎత్తిపోయొచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు ప్రాజెక్టులకు నీటిని వదలకుండా కృష్ణా జలాలను వృథాగా దిగువకు వదిలిపెడుతున్నదని పాలమూరు నేతలు మండిపడుతున్నారు. ఇదిలావుంటే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం



పట్టిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు 42,114 క్యూసెక్కుల ఇన్ ఎ÷-లో కొనసాగింది. ప్రస్తుతం డ్యాంలో 1,623.68 అడుగులకు గాను 72.26టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. తాగునీటి అవసరాలు కోసం వివిధ కాల్వలకు 1,514 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగునీటి విడుదలపై ఈనెల 11 తేదీన కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# ఎంతోకాలం యుద్ధంతో తీవ్ర నష్టం

### ఇరాన్ యుద్ధం నుంచి బయటపడడమే మేలు

### ట్రంప్‌నకు జనరల్ డాన్ కేన్ సహా ఇచ్చినట్లు ప్రచారం

వాషింగ్టన్,ఆగస్ట్8: గత ఐదు నెలలుగా ఇరాన్‌తో సాగిస్తోన్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోతున్నాయని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని స్వదేశంలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్య జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ ట్రంప్కార్యవర్గానికి కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం నుంచి ఇకనైనా బయటపడాలని.. లేదంటే ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్‌తో యుద్ధం స్వల్పకాలికంగా ఉండాల్సింది. ఇప్పటికే అది ఆ దశను దాటేసింది. పశ్చిమాసియలో ఘర్షణలు తీవ్రతరం చేయడానికి మనకు అందుబాటులో ఉన్న సైనిక చర్యలు ప్రతికూల ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉంది. కేవలం వైమానిక శక్తితోనే నిర్దేశిత లక్ష్యాలను మనం సాధించలేం. అందుకే ఇకనైనా, ఈ యుద్ధం నుంచి బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని ట్రంప్ సలహాదారులకు డాన్ కేన్ ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే విషయం గురించి ఆయన పలువురు క్యాబినెట్ అధికారులు, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తోనూ చర్చలు జరిపారట.



ఇరాన్‌లో భూతల దాడులకు విముఖత చూపుతోన్న అధ్యక్షుడు ట్రంప్.. దానికి బదులుగా వైమానిక దాడులను మరింతగా పెంచుతామని ఇటీవల కాలంలో పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ హెచ్చరికలతో ఇరాన్‌ను ఒప్పందానికి తీసుకురావొచ్చని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే, సుదీర్ఘ కాలంగా వైమానిక దాడులు చేపడుతుండటంతో అగ్రరాజ్య ఆయుధ నిల్వలు భారీగా తగ్గిపోతు న్నాయి. ఇప్పటికే 80 శాతం మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటర్‌సెప్టర్లు, దాదాపు సగం పేట్రియాట్ క్షిపణులు కరిగిపోయినట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. అయితే, వీటిని ట్రంప్ కొట్టిపారేశారు. తమ వద్ద పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాక, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. భారీ సంఖ్యలో ఎ÷-లాంట్లు, ఫ్యాక్టరీలను రక్షణ రంగ కంపెనీలు నిర్మిస్తున్నాయని తన ట్రూత్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, క్షిపణుల సంఖ్య గురించి మాత్రం ఆయన కచ్చితమైన లెక్క చెప్పకపోవడం గమనార్హం.

## మరింత విషమంగా మెడికో ప్రియాంక ఆరోగ్యం

హైదరాబాద్,ఆగస్ట్8
రాజమండ్రి మెడికో విద్యార్థిని ప్రియాంక ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ప్రస్తుతం వెంటిలేటర్‌పై వైద్యులు ఆమెకు చికిత్స అందజేస్తున్నారు. ఇటీవల రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్యామాల్‌లో స్కూటీపై వెళ్తున్న మెడికోలు డాక్టర్ ప్రియాంక, దుర్గవెంకటసాయిలను మద్యం సేవించిన కొందరు యువకులు కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ నేపథ్యంలో ప్రియాంక తలపై నుంచి కారు వెళ్లడంతో బ్రెయిన్ డెడ్‌కు గురైంది. దీంతో విద్యార్థినిని హుటాహుటిన రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు తరలించగా.. కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. గడిచిన ఆరో రోజులుగా ప్రియాంక మృత్యువుతో పోరాడుతోంది. మెడికో ప్రియాంక చికిత్సలో చివరి ప్రయత్నంగా నేడు ఆప్నియా పరీక్ష చేయనున్నారు. కోమాలో ఉన్న ప్రియాంక మెదడు పూర్తిగా పనిచేయడం ఆగిపోయిందా.. లేదా అని నిర్ధారించడానికి డాక్టర్లు కీలకమైన పరీక్ష చేయనున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందా.. లేదా అనేది అప్నియా పరీక్షతో తెలుసుకోనున్నారు. ఆప్నియా పరీక్ష అనంతరం చివరి రిజల్ట్‌ను విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు.

# యూపీఐ చెల్లింపులు ఉచితమే




దేశవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ చెల్లింపులపై వినియోగదారులకు ఎలాంటి రుసుము విధించబోమని ఫోన్‌పే సీఈఓ, సహ వ్యవస్థాపకుడు సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ లావాదేవీలపై ఛార్జీల వసూలుకు సంబంధించిన బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంతో, డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేస్తారనే ఆందోళన వినియోగదారుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో సమీర్ నిగమ్ కీలక ప్రకటన చేశారు

యూపీఐ లావాదేవీలపై భారతీయ వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుమునూ వసూలు చేయబోమని సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. భారతీయ యూజర్లకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే ఉంటాయని, డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. యూపీఐ వ్యవస్థను సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉచితంగానే కొనసాగించడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు

యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధించేందుకు చట్టపరమైన అవకాశం కల్పించే మార్పులపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది అయితే రుసుము విధించే తుది విధానం ఇంకా ఖరారు కాలేదు. కొన్ని ప్రతిపాదనల్లో నిర్దిష్ట విలువకు మించిన లావాదేవీలు లేదా నిర్దిష్ట వార్షిక వ్యాపార పరిమాణం కలిగిన వ్యాపారులపై మాత్రమే రుసుము విధించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు నివేదికలు వెల్లడించాయి.

# ఎస్‌బీఐ భళా!




ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 13.73 శాతం వృద్ధితో రూ.24,113 కోట్లకు ఎగబాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడంతో పాటు కేటాయింపులు తగ్గడం ఇందుకు దోహదపడింది. ఈ క్యూ1లో బ్యాంకు స్టాండ్‌ఎలోన్ లాభం రూ.21,121.22 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇదే కాలానికి నమోదైన స్టాండ్‌ఎలోన్ ప్రాఫిట్ రూ.19,160.44 కోట్లతో పోలిస్తే 10.23 శాతం వృద్ధి కనబరిచింది. మరిన్ని ముఖ్యాంశాలు.. ఈ జూన్‌తో ముగిసిన మూడు నెలల్లో ఎస్‌బీఐ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన దాదాపు 15 శాతం వృద్ధితో రూ.46,992 కోట్లకు పెరిగింది. సమీక్షా కాలానికి బ్యాంకు స్థూల రుణాలు 18.63 శాతం పెరగడం ఇందుకు తోడ్పడింది. కాగా, ఈ క్యూ1లో బ్యాంక్ దేశీయ వ్యాపార నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) వార్షిక ప్రాతిపదికన పోలిస్తే స్వల్పంగా తగ్గి 3 శాతానికి పరిమితమైంది. కానీ, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే ఎన్ఐఎం 0.07 శాతం పెరిగింది.

గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ వడ్డీయేతర ఆదాయం మాత్రం 9 శాతం తగ్గి రూ.15,293 కోట్లకు జారుకుంది. ఫారెక్స్ లేదా డెరివేటివ్ ఆదాయం 70 శాతం మేర తగ్గడం ఇందుకు ప్రధాన కారణం.

ఈ క్యూ1లో ఎస్‌బీఐ డిపాజిట్లు 9.73 శాతం వృద్ధి చెందాయి. మొత్తం డిపాజిట్లలో కరెంట్, సేవింగ్ అకౌంట్ల (కాసా) వాటా 0.12 శాతం తగ్గి 39.36 శాతానికి పరిమితమైంది.

గడిచిన మూడు నెలల్లో రూ.7,046 కోట్ల రుణాలు మొండి బకాయిలుగా మారాయి. గత ఏడాదిలో ఇదే కాలానికి కొత్తగా మొండి బకాయిలుగా మారిన రూ.7,945 కోట్లతో పోలిస్తే గణనీయంగా తగ్గినప్పటికీ, ఈ మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.5,521 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగాయి.బ్యాంక్ ఆస్తుల నాణ్యత మరింత మెరుగుపడింది. గత ఏడాది జూన్ 30 నాటికి 1.83 శాతంగా నమోదైన బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ).. ఈ జూన్ చివరికల్లా 1.47 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.38 శాతానికి జారుకున్నాయి. గడిచిన రెండు దశాబ్దాలకు పైగా కాలంలో బ్యాంక్‌కు ఇదే అత్యల్ప ఎన్‌పీఏ నిష్పత్తి అని ఎస్‌బీఐ వెల్లడించింది. ఈ క్యూ1లో బ్యాంక్ మొండి బకాయిల నష్టాన్ని పూడ్చుకునేందుకు రూ.3,359 కోట్లు కేటాయించింది.




# నాలుగో రోజూ లాభాలొచ్చాయ్..

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభపడ్డాయి. ఇరాన్‌పై దాడులు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ముడి చమురు ధరలు భారీగా తగ్గడం ఇందుకు దోహదపడింది. విదేశీ సంస్థాగత పెట్టుబడుల రాక కూడా మార్కెట్లకు కలిసి వచ్చింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 800 పాయింట్లు ఎగబాకి 78,895.10 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 544.39 పాయింట్ల (0.70 శాతం) లాభంతో 78,639.03 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ 390.70 పాయింట్లు (1.6 శాతం) ఎగబాకి 24,774.30 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ-50 చివరి 2 నిమిషాల్లో దాదాపు 200 పాయింట్లు పుంజుకుంది. 3.28 గంటలకు 24,573 పాయింట్ల వద్ద ట్రేడైన నిఫ్టీ-50.. 3.30 గంటలకు 24,774 వద్ద ముగిసింది. స్టాక్ ఎక్స్ఛేంజీలు సోమవారం నుంచి ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్లో క్లోజింగ్ యాక్షన్ సెషన్ (సీఏఎ?స)ను ప్రవేశపెట్టడమే ఇందుకు కారణం. ఈ కొత్త విధానంలో ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎ?ఫ అండ్ ఓ)లో భాగమైన కంపెనీల షేర్ల ముగింపు ధరను వేలం ద్వారా నిర్ణయిస్తారు. మిగతా సంస్థల షేర్ల ముగింపు ధర నిర్ణయానికి ఎప్పటిలాగే వాల్యూమ్-వెయిటెడ్ యావరేజ్ ప్రైస్ (వీడబ్ల్యూఏపీ) విధానమే కొనసాగుతుంది. వీడబ్ల్యూఏపీ విధానంలో చివరి 30 నిమిషాల్లో జరిగిన ట్రేడింగ్ ఆధారంగా షేరు ముగింపు ధరను నిర్ణయిస్తారు. అయితే, దేశీయ ఈక్విటీ మార్కెట్‌నూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంతోపాటు షేరు ముగింపు ధరలో మరింత పారదర్శకత్వం కోసం సెబీ.. క్లోజింగ్ యాక్షన్ సెషన్‌ను ప్రవేశపెట్టింది. ఈ విధానంలో ఎఫ్ అండ్ ఓ జాబితాలోని షేర్లలో 3.15 గంటలకు సాధారణ ట్రేడింగ్ ముగుస్తుంది.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు పాటించాల్సిన డైట్ ఇదే..

**దీంతో లివర్‌కు ఎంతో మేలు..**



కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో ఒకటి. జీర్ణవ్యవస్థ నుంచి వచ్చే రక్తాన్ని శుద్ధి చేయడం, శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, మందులను జీర్ణక్రియకు అనుకూలంగా మార్చడం, పిత్తరసాన్ని ఉత్పత్తి చేయడం వంటి అనేక కీలక విధులను నిర్వహిస్తుంది. ప్రోటీన్ల తయారీ, రక్తం గడ్డకట్టడం, కొలెస్ట్రాల్ నియంత్రణ, రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడం, ఇన్ఫెక్షన్లతో పోరాడటం వంటి పనుల్లోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అయితే కాలేయంలో కొవ్వు అధికంగా పేరుకుపోతే ఫ్యాటీ లివర్ సమస్య ఏర్పడే అవకాశం ఉంటుంది. ఫ్యాటీ లివర్‌లో ప్రధానంగా రెండు రకాలున్నాయి. ఒకటి ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ కాగా, మరొకటి నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్. కాలేయం తన సాధారణ విధులను సక్రమంగా నిర్వహించలేని స్థాయిలో కొవ్వు పేరుకుపోయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. సాధారణంగా మనం తీసుకునే కార్బొహైడ్రేట్లు, కొవ్వులు శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువగా ఉన్నప్పుడు వాటిలో కొంత భాగం కొవ్వుగా నిల్వ అవుతుంది. కొంతకాలానికి ఈ అదనపు కొవ్వు కాలేయంలోనూ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ పేరుకుపోతుంది. కాలేయ బరువులో 5 నుంచి 10 శాతానికి పైగా కొవ్వు ఉంటే దాన్ని ఫ్యాటీ లివర్‌గా

లక్షణాలు ఇవే..

ఫ్యాటీ లివర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా పరిస్థితిని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. ఈ సమస్యకు ప్రత్యేకమైన లక్షణాలు తప్పనిసరిగా కనిపించవు. కొందరిలో అలసట, పొత్తికడుపులో అసౌకర్యం వంటి సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. పరీక్షల్లో కాలేయం పరిమాణం పెరిగినట్లు కూడా గుర్తిస్తారు. కాలేయంలో పేరుకుపోయిన కొవ్వు వాపులకు దారితీస్తే అలసట, గందరగోళం, పొత్తికడుపు నొప్పి, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, శారీరక బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన పరిస్థితుల్లో పొత్తికడుపు ఉబ్బడం, కామెర్లు రావడం, సులభంగా రక్తస్రావం కావడం వంటి సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

ఊబకాయం, మధుమేహం ఫ్యాటీ లివర్‌కు ముఖ్యమైన కారణాల్లో భాగంగా ఉన్నాయిజ. వీటితో పాటు కొవ్వు, చక్కెర అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, అధికంగా మద్యం సేవించడం, జన్యుపరమైన కారణాలు, వేగంగా బరువు తగ్గడం, కొన్ని మందుల దుష్ప్రభావాలు, రక్తంలో కొవ్వు స్థాయిలు అధికంగా ఉండటం వంటి కారణాలు కూడా ఫ్యాటీ లివర్‌కు దారితీస్తాయి.

ఆహారపు అలవాట్లు ముఖ్యం..




# మన శరీరంలో ఎన్ని విధులను నిర్వర్తిస్తుందంటే.. దీని ఉపయోగాలు చెప్పలేనివి..

ఆహారం మన శరీరానికి ఇంధనం లాంటిది. అయితే మనం తీసుకునే ఆహారం శరీరానికి అవసరమైన శక్తిగా ఎలా మారుతుంది? ఇందులో విటమిన్ బి6 కీలక పాత్ర పోషిస్తుంది. ఇది నీటిలో కరిగే పోషకం. ఆహారాన్ని శక్తిగా మార్చే ప్రక్రియలో సహాయపడటంతోపాటు మెదడు, నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి కూడా ఇది అవసరం. నీటిలో కరిగే పోషకాలను శరీరం ఎక్కువకాలం నిల్వ చేసుకోలేకపోవడంతో, ప్రతిరోజూ ఆహారం ద్వారా తగినంత విటమిన్ బి6ని పొందడం అవసరం. వయస్సు, లింగాన్ని బట్టి విటమిన్ బి6 రోజువారీ అవసరం మారుతుంది. గర్భిణీలు, పాలిచ్చే మహిళలకు కూడా దీని అవసరం భిన్నంగా ఉంటుంది. టర్కీ, అవకాడో, చికెన్, పిస్తా, ట్యూనా చేప, శనగలు, అమరాంత్, పొద్దుతిరుగుడు విత్తనాలు, నువ్వులు, అరటిపండ్లు, ఆలుగడ్డపలు, ఫోర్టిఫైడ్ సీరియల్స్, బీన్స్ వంటి ఆహారాల్లో విటమిన్ బి6 లభిస్తుంది.

గుండె ఆరోగ్యానికి..

విటమిన్ బి6 గుండె ఆరోగ్యానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు రక్తంలో హోమోసిస్టీన్ అనే అమైనో ఆమ్లం ఏర్పడుతుంది. ఇది అధికంగా ఉంటే వాపు, గుండె సంబంధిత సమస్యల ప్రమాదం పెరుగుతుంది. రక్తంలోని హోమోసిస్టీన్ స్థాయిలను నియంత్రించడంలో విటమిన్ బి6 సహాయపడుతుంది. ఫోలేట్‌తో కలిసి తీసుకున్నప్పుడు హోమోసిస్టీన్ స్థాయిలను తగ్గించడంలో, భవిష్యత్తులో గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడంలో కూడా ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. మెదడు పనితీరుకు కూడా విటమిన్ బి6 అవసరం. హోమోసిస్టీన్ అధికంగా ఉండటం నాడీ వ్యవస్థ పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. విటమిన్ బి6 లోపం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం వంటి మెదడు పనితీరులో సమస్యలు వచ్చే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతేకాకుండా అల్జీమర్స్, డిమెన్షియా వంటి సమస్యల ప్రమాదంతోనూ విటమిన్ బి6 లోపం సంబంధం కలిగి ఉంటుంది.

మానసిక స్థితికి..మన మానసిక స్థితిపై కూడా విటమిన్ బి6 ప్రభావం చూపిస్తుంది. సంబంధించిన హార్మోన్ల ఉత్పత్తిలో ఇది సహాయపడుతుంది. వీటి ఉత్పత్తి సక్రమంగా ఉండటం వల్ల

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో ఒకటి. జీర్ణవ్యవస్థ నుంచి వచ్చే రక్తాన్ని శుద్ధి చేయడం, శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, మందులను జీర్ణక్రియకు అనుకూలంగా మార్చడం, పిత్తరసాన్ని ఉత్పత్తి చేయడం వంటి అనేక కీలక విధులను నిర్వహిస్తుంది. ప్రోటీన్ల తయారీ, రక్తం గడ్డకట్టడం, కొలెస్ట్రాల్ నియంత్రణ, రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడం, ఇన్ఫెక్షన్లతో పోరాడటం వంటి పనుల్లోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అయితే కాలేయంలో కొవ్వు అధికంగా పేరుకుపోతే ఫ్యాటీ లివర్ సమస్య ఏర్పడే అవకాశం ఉంటుంది. ఫ్యాటీ లివర్‌లో ప్రధానంగా రెండు రకాలున్నాయి. ఒకటి ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ కాగా, మరొకటి నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్. కాలేయం తన సాధారణ విధులను సక్రమంగా నిర్వహించలేని స్థాయిలో కొవ్వు పేరుకుపోయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. సాధారణంగా మనం తీసుకునే కార్బొహైడ్రేట్లు, కొవ్వులు శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువగా ఉన్నప్పుడు వాటిలో కొంత భాగం కొవ్వుగా నిల్వ అవుతుంది. కొంతకాలానికి ఈ అదనపు కొవ్వు కాలేయంలోనూ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ పేరుకుపోతుంది. కాలేయ బరువులో 5 నుంచి 10 శాతానికి పైగా కొవ్వు ఉంటే దాన్ని ఫ్యాటీ లివర్‌గా పరిగణిస్తారు.

లక్షణాలు ఇవే..

ఫ్యాటీ లివర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా పరిస్థితిని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. ఈ సమస్యకు ప్రత్యేకమైన లక్షణాలు తప్పనిసరిగా కనిపించవు. కొందరిలో అలసట, పొత్తికడుపులో అసౌకర్యం వంటి సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. పరీక్షల్లో కాలేయం పరిమాణం పెరిగినట్లు కూడా గుర్తిస్తారు. కాలేయంలో పేరుకుపోయిన కొవ్వు వాపులకు దారితీస్తే అలసట, గందరగోళం, పొత్తికడుపు నొప్పి, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, శారీరక బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన పరిస్థితుల్లో పొత్తికడుపు ఉబ్బడం, కామెర్లు రావడం, సులభంగా రక్తస్రావం కావడం వంటి సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు పాటించాల్సిన డైట్ ఇదే..






## 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.

------------

# రామాయణ తొలుత విదేశాల్లో విడుదల




రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బ్జడెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.

---

# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం




ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమా చారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తినెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది



ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు.

త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు.

# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణేష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కనకరాజు' మంచి జోరు చూపించింది.